# పశ్చాత్తాపం

'వాణి'

పోర్టికోలో కారాగిన చప్పుడు విని రాధతో ఆడుకుంటున్న ఆరేళ్ల జయలక్ష్మి, 'మా నాన్నగారు వచ్చారు' అంటూ మెట్లు దిగి పరుగెత్తింది.

ప్రకాశరావు కారుదిగి చేతిలోని బిస్కట్ ప్యాకెట్ కూతురికందిచ్చాడు. ఇద్దరూ లోపలికి వస్తూ ఉండగా ప్రకాశరావు మెట్లమీద బెదురు చూపులతో నిలుచున్న రాధను చూశాడు.

'ఆ పాప యెవరు బేబీ ?' అని ప్రశ్నించాడు. అసలు పేరు జయలక్ష్మి అయినా ప్రకాశరావు మాత్రం ఆ పేరుతో పిలువలేక 'బేబీ' అనేవాడు.

"మన వీధిలోకి క్రొత్తగా వచ్చారు నాన్న! మా స్కూల్లో నాలుగోక్లాసు చదువుతూంది," అని బేబీ వెళ్లి రాధ చేయి పుచ్చుకొని తీసుకొచ్చి సోఫాలో కూర్చోబెట్టింది.

రాధ మొహంలోకి పరీక్షగా చూసిన ప్రకాశరావు ఉలిక్కిపడ్డాడు. విశాలమైన ఆ కళ్లు తనకు పరిచితమైన యెవరినో జ్ఞప్తికి తెస్తున్నాయి.

'అదేమిటి ? రాధవైపు అంతపరీక్షగా చూస్తున్నారు. బెదిరిపోగలదు' అన్న భార్య విమల మాటలతో తేరుకొని ట్రేలోని కాఫీకప్పు అందుకున్నాడు.

రాధ బేబీ ఆడుకొందుకు కాంపౌండులోకి వెళ్లిపోయారు.

♦ ♦ ♦

ప్రకాశరావు రాధను అప్పుడప్పుడు పలుకరించేవాడు. ఆ పాప నమ్రత, తెలివితేటలు ఉట్టిపడే మొహం ఆతన్నెంతో ఆకర్షించాయి.

'బేబీని నీవే మాత్రం అదుపులో పెట్టలేకుండా ఉన్నావు. రాధ తల్లి యెంతో నేర్పరై ఉండాలి,' అంటూ విమలను దెప్పిపొడిచేవాడు.

రాధ, బేబీ ఆడుకోవడం చూస్తూ పరధ్యానంగా ఉండిపోయేవాడు. రాధ కళ్లు తన గత జీవితాన్ని గురించి నిలవేస్తున్నట్లుండేవి.

ఆ నాడు రాధ పుట్టినరోజు. స్వీట్సు పట్టుకొని క్రొత్తగౌనుతో రాధ బేబీవద్దకు వచ్చింది. తనదగ్గరే కూర్చున్న తండ్రికి బేబీ లడ్డూ చేతిలో పెట్టింది.

'ఈ వేళ నా పుట్టినరోజు,' అన్నదిరాధ. 'క్రొత్త గౌను యెవరు కుట్టించారు రాధా ?' ప్రకాశరావు సరదాగా అడిగాడు.

'మా మామయ్య కుట్టించాడు. మా అమ్మ జ్వరంతోనే లేచి స్వీట్సు చేసింది,' అన్నది.

'మరి మీ నాన్నగారెక్కడ ఉన్నారు ?' అప్రయత్నంగా అతని నోటివెంట వెలువడింది. ఆ ప్రశ్న వినగానే రాధ మొహం క్షణకాలం కళావిహీనమైంది.

'నేనెప్పుడూ మా నాన్నను చూడలేదు. నాకు తెలీదు,' అన్నది దిగులుగా. ప్రకాశరావు చాలబాధపడ్డాడు.

'మీ మామయ్య పేరేమిటి ? ఏం చేస్తున్నారు ?' ఎన్నడూ అడగని వివరాలు తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది.

'మా మామయ్య గవర్నమెంటు డాక్టరు. పేరు రఘు,' ప్రకాశరావు త్రుళ్లిపడ్డాడు.

'మీ అమ్మ...?' ప్రకాశరావు స్వరం వణికింది.

'మా అమ్మ పేరు జయ, బి. ఏ. ప్యాసయింది. నా పాఠాలన్నీ మా అమ్మే బోధపరుస్తుంది,' రాధ కళ్లు గర్వంతో మెరిశాయి. ప్రకాశరావు తలతిరిగిపోయింది. ఆలోచనలు కొన్ని సంవత్సరాల వెనకకు పరిగెడుతున్నాయి. క్రోధమూ, బాధా నిండిన మనస్సుతో కుర్చీలో వెనుకకు వాలిపోయాడు.

♦ ♦ ♦

ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుతూ జీవితాన్ని మధురంగా గడుపుతున్న రోజులవి. బి. ఏ. లో జయ తన క్లాసుమేటు. జయ తెలివైంది, ఆకర్షణీయమైన రూపంకలది.

స్టూడెంట్సు యూనియన్ సెక్రెటరీ అయిన

ప్రకాశరావుకు చలాకీగా ఉండే జయతో పరిచయమైంది. అతని వాగ్ధోరణి, సుందర రూపం ఆమెను ముగ్ధురాలిని చేశాయి. మెరీనా బీచీ, కాని మెరా లైబ్రరీ వారిని కొన్నాళ్ళకు సన్నిహితుల్ని చేశాయి.

జయకు తల్లిదండ్రులులేరు. యం. బి. చదివే రఘు ఆమె తమ్ముడు.

హృదయాలు పరస్పరానురాగ పూరితాలు కాగా, బి. ఏ. ప్యాసయిన తరువాత జయ, ప్రకాశరావు వివాహం చేసుకున్నారు. స్నేహితులంతా చాల ఆనందించారు. కాని వారిక్లాసు మేటయిన సురేష్ మటుకు బాధ పడ్డాడు. అతడూ జయను నిండు మనస్సుతో ప్రేమించాడు. కాని ఆమె హృదయ వీణతీగెల్ని మాత్రం తనవైపుగా స్పందింపజేసుకోలేకపోయాడు. అయితే సభ్యతగల వ్యక్తి కావడంవలన పైకేమీ వ్యక్తపఱచలేదు. ప్రకాశరావు ఉద్యోగంలో చేరాడు. యూనివర్సిటీలో ఎమ్. ఏ. చదివే సురేష్ అప్పుడప్పుడు వారి యింటికి వచ్చేవాడు. పూర్వపరిచయాన్ని పురస్కరించుకొని జయ కూడ మాట్లాడేది.

సురేష్ రావడం ప్రకాశరావు కంతయిష్టం ఉండేదికాదు. అదీ కాక ఒక స్నేహితుడివలన సురేష్ భగ్న ప్రేమ విషయం విన్నాడు. అప్పటి నుండి అతని మనస్సు పాడైంది. కాని జయకీ విషయాలు తెలియవు. సురేష్ వెళ్లిపోయాక యేదో వంకతో జయను కసిరేవాడు. నిండు హృదయంలో జయచూపే ఆదరాభిమానాలు మాత్రం ప్రకాశరావులో అనుమానానికి తావు లేకుండా చేసేవి.

జయకు పాపపుట్టే సూచనలు కన్పించాయి. పురిటికి పంపవలసిందిగా విశాఖపట్నంలో ఉంటున్న ఆమె మేనమామ వ్రాశాడు. కొద్ది రోజులకు జయ అక్కడికి వెళ్లిపోయింది.

ప్రకాశరావు తండ్రి కాబోతున్నట్లు తెలిసి ఫ్రెండ్సుహర్షం వెలిబుచ్చారు. సురేష్‌పట్ల మటుకు అతను విముఖంగా ఉండిపోయాడు.

♦ ♦ ♦

జయకు కుతూరు పుట్టింది. ఆమెను తీసుకొని రావడానికి ప్రకాశరావు వెళ్లాడు.

మాటల సందర్భంలో జయ, 'ఈ మధ్య సురే యీ ఊరువచ్చాడు. మన పాపకు యీ కప్పు ఫ్రాకు యిచ్చాడు.' అని చెప్పింది. ప్రకాశరావు హృదయం భగ్గుమంది. ఆమె చేతిలోని కప్పు ఫ్రాకు విసిరేశాడు.

'సురేష్‌తో నువ్వు మాట్లాడకూడదని అతని ప్రస్తావన మన మధ్య రాకూడదని లక్షసార్లు చెప్పాను. కాని నీకు అతనంటే అభిమానం. అందుకే అతన్ని గౌరవిస్తున్నావు. ద్రోహివి,' అనుమానం ద్విగుణీకృతం కాగా ఆవేశంతో అరిచాడు. జయ నిర్ఘాంత పోయింది.

'సురేష్ మనయిద్దరి క్లాసుమేటు. సంస్కారం గల వ్యక్తిగా అర్థం చేసుకొని సోదరుడుగా గౌరవించాను. నన్ను నమ్మండి. నా సర్వస్వం మీరే,' జయ నల్లని కళ్ళలో నీళ్లు సుళ్లు తిరిగాయి.

'నన్ను మాటలతో మధ్య పెట్టడానికి ప్రయత్నించకు జయా! కల్మషపూరితమైన హృదయం కలిగిన నిన్నిక నా భాగస్వామినిగా గౌరవించలేను,' అతని ఆవేశం హద్దులు దాటింది. జయకు తలపై పిడుగుపడినట్లు అయింది. కన్నీళ్ళతో భర్తను అర్థం చేసుకోమని వేడుకుంది. తల్లి దండ్రులు లేని తనను లేని పోని అపోహలతో దూరం చేసుకోవద్దని విలపించింది. కాని అతని రాతి హృదయం కరగలేదు. నిష్కారణంగా యేర్పడిన దురభిప్రాయంతో ఆమెకు దూరంగా వెళ్ళిపోయాడు.

దుర్భరమైన ఒంటరి జీవితాన్ని, నోరులేని పసిపాపను తల్చుకొని జయ కంపించిపోయింది.

జయకు వచ్చిన కష్టానికి రఘు చాల బాధపడ్డాడు. రఘు చదువు పూర్తి చేసి గవర్నమెంటు డాక్టరుగా కాకినాడ వెళ్లాడు. ఎప్పటికైనా ప్రకాశరావు మారకపోడనే ఆశతో అక్కా తమ్ముళ్లు రోజులు గడపసాగారు. జయ ఆవేదనతో కృశించసాగింది.

ప్రకాశరావులో గూడుకట్టుకున్న ద్వేషం జయ నిర్దోషిత్వాన్ని గురించి ఆలోచించ నివ్వలేదు. నేరం చేస్తూన్నట్లు ఫీలవుతూనే విమలను పెళ్లి చేసుకున్నాడు. కాలక్రమాన పరీక్షలు ప్యాసయి ఆఫీసరుగా కాకినాడకే వచ్చాడు. కాని మానసికంగా అతనికి శాంతిలేకపోయింది.

♦ ♦ ♦

ఏడు సంవత్సరాల తరువాత యీ నాడు తన

ఎదురుగా నిల్చున్న రాధ జయ పవిత్రతను సవాల్ చేస్తున్నట్లు తోచింది. అమాయకంగా తన వైపు చూస్తున్న రాధను అప్రయత్నంగా దగ్గరకు తీసుకున్నాడు.

'నాన్నను చూడాలని ఉన్నదా రాధా?' అని అడిగాడు.

'అవును మా నాన్నగారు తప్పకుండా వస్తారని సురేష్ మామయ్య ఎప్పుడూ చెప్పేవాడు,' అన్నది.

'సురేష్ మామయ్య!' ప్రకాశరావులో క్రొత్త ఆలోచనలుదయించాయి. సురేష్, జయ నిరపరాధులేమో! నిజమాలోచిస్తే పెళ్ళినాటికి సురేష్ తన కంటె అన్ని విధాలా ఉన్నతస్థితిలో ఉన్నాడు. ఆకర్షింపబడే అన్ని గుణాలూ అతనిలో ఉన్నాయి. కాని జయ తనను వివాహం చేసుకుంది. తన జీవితంలో ఆనందాన్ని పరుగులెత్తించింది. ఎంతమధురంగా ఉండేవి ఆ రోజులు! వారి స్నేహాన్ని తనే అపార్థం చేసుకున్నాడేమో! 'నాన్నా! యీ రోజు సినిమాకు వెళ్దామన్నారుకదూ!' బేబీ మాటలతో అతను ఆలోచనల్లోంచి తేరుకున్నాడు.

◆ ◆ ◆

ఆవేదనతో, మానసిక సంఘర్షణతో బలహీనుడైన ప్రకాశరావు వారంరోజుల సెలవు అనంతరం ఆఫీసులో అడుగు పెట్టాడు. రాధ ఆ నాటినుండి రాలేదు.

అన్యమనస్కంగా పేపరు తిరగేస్తూన్న ప్రకాశరావు, 'బాబాయ్' అన్న రాధ పిలుపుతో ఉలిక్కిపడ్డాడు.

"మా సురేష్ మామయ్య మిమ్మల్ని చూస్తానంటే తీసుకొచ్చాను," అన్నది రాధ.

'అతను నీకు బాబాయ్ కాదు రాధా! మీ నాన్నగారే,' అన్నాడు సురేష్. ప్రకాశరావు తలెత్తి చూశాడు. సురేష్ స్వచ్ఛమైన నవ్వు అతన్ని కలవరపరిచింది.

'అకారణమైన అపోహతో జయ నీకు దూరమవడం సహించరాని విషయం ప్రకాశం! ఆమె నాకు సోదరివంటిది. అమాయకురాలు. నీ కోసం కృశించి చావుబ్రతుకుల మధ్యనున్న ఆమెను యిప్పటికైనా అర్థం చేసుకోవడం నీ కర్తవ్యమనుకుంటాను. నీవు ఊహించే అక్రమసంబంధం మా మధ్య లేనేలేదు. ఇప్పటికైనా నమ్ము ప్రకాశం! ఈ పాపను దగ్గరకు చేర్చుకో;" సురేష బాధతో అతనికి నచ్చచెప్పాడు.

రాధ వింతగా యిద్దరివైపు చూస్తూంది.

'వెళ్ళిపో సురేష! ఇక్కడినించి వెళ్ళిపో!' ప్రకాశరావు పిచ్చిగా అరిచాడు.

జయ దీనవదనం పదేపదే జ్ఞప్తికి రాసాగింది. సురేష్ మాటలు అతన్ని వెన్నాడుతున్నాయి. జయ నిర్దోషి అని అంతరాత్మ ఘోషించసాగింది. ఇంక అతను నిలువలేకపోయాడు. జయను చూడటానికి బయలుదేరాడు.

హాస్పిటల్ గుమ్మంలో విచారవదనంతో రఘు ఎదురైనాడు. ప్రకాశరావు చూసీ చూడనట్లు వెళ్ళబోయాడు. కాని అతను 'రఘూ' అంటూ చేయి పట్టుకున్నాడు.

'ఏంకావాలి?' విసుగ్గా అడిగాడు.

'జయను చూడాలని రఘూ!' అన్నాడు.

'ఎందుకు? ఆమెను బాధించడానికి యింకేమైనా క్రొత్తకారణాలు సృష్టించుకు వచ్చారా?' తీవ్రంగా అడిగాడు. ప్రకాశరావు నేరస్థునివలె తలవంచుకున్నాడు.

'నేనామెకు ద్రోహమే చేశాను రఘూ! ఒకసారి చూపి మనశ్శాంతిని పొందనియ్యి. ఇంకా నన్ను అపార్థం చేసుకోకు రఘూ!' ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

ఇద్దరూ జయ ఉన్న రూములోకి వెళ్ళారు. రాధ 'అమ్మా,' అంటూ హృదయవిదారకంగా ఏడుస్తూంది.

ప్రకాశరావును చూడగానే జయ కళ్ళలో వేయి దీపాలు వెలిగాయి.

'నేను వచ్చాను జయా! నన్ను క్షమించవూ!' దీనస్వరంతో కన్నీళ్ళు కార్చాడు.

'మిమ్మల్ని చూడగలిగాను. నాకది చాలు. రాధను పెద్దకూతురుగా చూసుకోరూ,' జయ గద్గద స్వరంతో అన్నది.

'మీ నాన్నగారు!' రాధ తల శుష్కహస్తాలతో నిమిరింది.

'రాధా! రామ్మా!' అంటూ వాత్సల్యంతో చేతులుచాచి దగ్గరకు తీసుకున్నాడు.

'రాధను ఒక్కనాటికి అన్యాయం చేయను జయా!' అని ఆమె చేతిని ప్రేమతో తన చేతిలోకి తీసుకున్నాడు.

ఆ వేదనలు దూరంకాగా తృప్తిగా శ్వాస విడిచింది జయ.